క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ఆదోని అర్బన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టీసీపీ జే.సోమశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోని మున్సిపల్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు, వాటిని వాడడం వల్ల కలిగే అనర్థాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం రమేష్‌నాయుడు, ప్రియాంక చేతులమీదుగా బహుమతులను అందించారు. పొగాకుకు అందరూ దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది వెంకటసుబ్బయ్య, చిన్నవెంకటయ్య, ఆశావర్కర్లు ఈరమ్మ, నాగలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

25న ఉప్పర సగరుల ఆత్మీయ సమ్మేళనం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శ్రీరామస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీన ఉప్ప ర, సగర సంఘ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యన్న, యూకే వీరేంద్ర తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. ఈ సమ్మేళనంలో ఉప్పర, సగరుల సమస్యలపై చర్చించడంతో పాటు సంఘ పట్టణ అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి ఉప్పర, సగర కులస్థులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

జీఓ 117ను రద్దు చేయాలి

గోనెగండ్ల: ప్రభుత్వ విద్యా వ్యవస్థను అస్తవ్య స్తం చేస్తూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్న జీఓ నంబర్ 117ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కా ర్యదర్శి ఎస్.నరసింహులు డిమాండ్ చేశారు. గోనెగండ్లలోని ఆయా పాఠశాలలను శుక్రవారం యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, చంద్రపాల్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ 117తో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, పాఠశాలలు విలీనం చేయడం వల్ల విద్యా వ్యవస్థ బలహీన పడిందన్నారు. అలాగే 14 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయన్నారు. అలాగే పాఠశాలలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించిన ఉపాధ్యాయ సమస్యల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వర రావు, విజయకుమారి, అక్బర్, వేణుగోపాల్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పంచాయతీ వేలాలు

కోసిగి: మేజర్ గ్రామ పంచాయతీ కోసిగికి సంబంధించిన పంచాయతీ వేలాలు డీఎల్‌పీఓ నూర్జహాన్, గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నిమిత్తం మూడు నెలలు పాటు వాయిదా పడింది. ఈ మేరకు జూలై 1 నుంచి 31–03–2025 వరకు 9 నెలలకు సంబంధించి వేలాలు నిర్వహించారు. ఇందులో వారపు సంత మార్కెట్ రూ.1.30 లక్షలకు, బండి మెట్ట రూ.6.90 లక్షలకు చింతలగేని నర్సారెడ్డి, చిన్న కమేళా రూ.31 వేలకు నూర్ అహ్మద్, పెద్దకమేళా రూ.20 వేలకు రాజేష్ కైవసం చేసుకున్నారు. గతేడాదితో పోల్చితే పంచాయతీకి ఆదాయం తగ్గిందని డీఎల్‌పీఓ తెలిపారు. ఎంపీపీ ఈరన్న, ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, పంచాయతీ ఈఓలు తిరుమలేశ్వర రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

సొసైటీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణం, సభ్యత్వము తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం సీఈఓ మురళీధర్‌రెడ్డి తెలిపారు. సొసైటీలో సభ్యత్వం యథావిధిగా కొనసాగాలంటే రైతులు వారికి సంబంధించిన పొలం, సహకార సంఘం పాసు పుస్తకాలు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలను సొసైటీ సిబ్బందికి అందజేయాలన్నారు. అలా అందజేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సబ్సిడీలు వర్తించవని తెలియజేశారు. పూర్తి వివరాలకు 97045 76652, 99636 05978 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిల్‌సాగర్

ఆదోని టౌన్: క్షయ (టీబీ) పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అనిల్‌సాగర్ సూచించారు. ఈ మేరకు హనుమాన్ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనిల్‌సాగర్ మాట్లాడుతూ.. వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో టీబీ యూనిట్‌లో గళ్ల పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే ప్రతినెలా రూ.500 ఆర్థిక సాయం అందిస్తారన్నారు. టీబీ రోగులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ బాబురాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థినులు



చిన్నారుల యోగాసనాలు



నాగలదిన్నెలో జెడ్పీ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ఘనంగా యోగా దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. స్థానిక మాచాని సోమప్ప జెడ్పీ బాలికల హైస్కూల్‌తో పాటు వీవర్స్ కాలనీ, ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని యోగాసనాలు చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, యోగా ట్రైనర్ శ్రీనివాసులు, కిరణ్‌కుమార్‌గౌడ్, బాబు, ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఆర్‌ఐ కొండలరావు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: యోగాతో ప్రతిఒక్కరూ ఏకాగ్రత సాధించవచ్చని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఆవరణలో స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యోగాతో మానసిక ఉత్తేజం,ఆరోగ్యం, ఏకాగ్రత పొందవచ్చునని తెలిపారు. సర్వరోగ నివారిణి యోగా అని చెప్పారు. స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని విద్యార్థులు, ఉపాధి హామీ పథకం అధికారులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. నాగలదిన్నె జెడ్పీ పాఠశాలలో పీటీఈ టీచర్ చిన్నబుజ్జి ప్రశాంతి నేతృత్వంలో విద్యార్థులు, పూల చింత చెరువులో ఉపాధి హామీ పథకం ఎమ్మిగనూరు క్లస్టర్ డైరెక్టర్ (సీడీసీఎల్‌ఆర్సీ) సుజాత ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో యోగాసనాలు వేశారు. హెచ్‌ఎం జీ.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఈరన్న, ఎపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం అలవడుతుందని పెద్దహరివాణం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం ఇందిరాదేవి అన్నారు. స్థానిక పాఠశాలలో విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని మానసిక, శారీరక దృఢత్వానికి యోగా అవశ్యకమని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రామన్న, ఉపాధ్యాయులు రామకృష్ణ, రమణమూర్తి, నాయక్, మంజుల, యశోధ, పర్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: యోగాను నిత్యం సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు వేణుగోపాల్ అన్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో బీజేపీ ఆదోని పట్టణాధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు మాట్లాడుతూ.. 84 లక్షల రకాల యోగాసనాలను మనకు గురువులు అందించారన్నారు. వాటిలో సూక్ష్మంగా 20 యోగాసనాలను నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి అవలంబిస్తే సంపూర్ణమైన ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, నాయకులు విట్టా రమేష్, మలేకర్ శ్రీనివాసులు, దేవేంద్ర, అజయ్‌కుమార్, శ్రీనివాస్ ఆచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యోగా గురువు వేణుగోపాల్ యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మురళీ మోహన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. యోగా వల్ల చికాకు, కోపం, ఒత్తిడి వంటివి దూరమవుతాయన్నారు. విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జోనాథన్, ఉమాదేవి, వెంకట్రామి రెడ్డి, అధ్యాపకులు యుగంధర్ రెడ్డి, నళిని, ఇందిరా, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



పెద్దహరివాణంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మంత్రాలయం: నియోజకవర్గంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అంపయ్య నేతృత్వంలో విద్యార్థులచే యోగాసానాలు చేయించారు. వైష్ణవి పాఠశాలలో కరెస్పాండెంట్ రఘు నేతృత్వంలో యోగా దినోత్సవం జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు అంపయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు రామన్న, శ్రీనివాసులు, చంద్రశేఖర్, విఠోబ, పుష్పలత, సుభాషిణి, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: యోగాతో ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. కౌతాళంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి మనిషి ఒత్తిడితో జీవనాన్ని కొనసాగిస్తూ తీరిక లేకుండా ఉంటున్నారన్నారు. దీని వల్ల బీపీ,షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రతిరోజు అరగంట యోగా చేస్తే మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బదినేహాల్ జడ్పీ పాఠశాలలో కొత్తగా చేరిన 6వ తరగతి విద్యార్థులతో యోగా చేయించారు. నదిచాగి జడ్పీ పాఠశాలలో యోగాసనాలు చేయించారు. ఉపాధ్యాయులు పంపాపతిగౌడ్, ప్రసాద్, పీఈటీ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థినులు



ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇస్తున్న గురువు



మంత్రాలయం జిల్లా పరిషత్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



యోగా చేస్తున్న బదినేహాల్ పాఠశాల విద్యార్థులు



బదినేహాల్ విద్యార్థుల యోగాసనాలు

బోధనేతర యాప్‌లను రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: బోధనేతర యాప్‌లను రద్దు చేసి పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహా అధ్యక్షులు సి.నాగరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని తప్పుదోవ పట్టించే జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి, ప్లస్ టూ వరకు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్టీయు పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రవి, భీమరాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఇతర పనులు అప్పగించరాదన్నారు. ఎస్టీయూ నాయకులు లోక్యనాయక్, రామయ్య, ప్రహ్లాద్, సుధాకర్ బాబు, భాస్కరాచారి,, నాగేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బీమా రెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని 52 బసాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బీమారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఆయన తరపున పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో కిట్లను అందించారు.విద్యార్థులు కష్టపడిచదవాలని సూచించారు.

ఎమ్మెల్యే ప్రమాణస్వీకారంపై సంబరాలు

మంత్రాలయం: నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి గెలుపొంది ఎదురులేని నేతగా నిలిచారు. నాల్గవసారి విజయం సాధించి శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రం మంత్రాలయంలో నాయకులు, పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, రాఘవేంద్ర స్వామికి, వినాయకుడు, దుర్గమాత, రాముడు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు, జోహార్లు పలికారు. రాఘవేంద్ర సర్కిల్‌లో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బీమా రెడ్డి మాట్లాడుతూ వై.బాలనాగిరెడ్డి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అధికారం రాలేదన్న ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు మల్లికార్జున, నాయకులు శివకుమార్, రామాంజినేయులు, వడ్డే నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

రక్తదానంతో ప్రాణదానం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎంపీ, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకుడు బుట్టా నాగరాజు కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. అనంతరం బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. అదేవిధంగా స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. వైస్ చైర్మన్ నజీర్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు వీరేంద్ర, వాహిద్, శివప్రసాద్, కేశవరెడ్డి, ఇషాక్, షబ్బీర్ అహమ్మద్, అమాన్, సోమేష్, కోటకొండ నరసింహులు, శ్రీనివాసరెడ్డి, వినయ్, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, మధు, చంద్రశేఖర్, విరుపాక్షిరెడ్డి, రఘు, ఫయాజ్, వీరేష్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారులకు ప్రొటోకాల్ తెలియదా?



పెద్దకడబూరులో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు: పెద్దకడబూరులో పనిచేసే మండల స్థాయి అధికారులకు ప్రొటోకాల్ తెలియదా అని ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ రామాంజనేయులు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొటోకాల్‌లో భాగంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, స్థానిక సర్పంచ్‌లను ఆహ్వానించాల్సి ఉండగా, మండల స్థాయి అధికారులు మాత్రం ఏ మాత్రం అర్హత లేని వ్యక్తులచే పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరించే అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్లుకుంట సర్పంచ్ ఇస్మాయిల్, పెద్దకడబూరు ఎంపీటీసీ సభ్యురాలు–1 జగతప్ప గారి సుజాత పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు



పెద్దకడబూరులో ఏరువాక పౌర్ణమి వేడుకలలో సీపీఐ నాయకులు, రైతులు



హల్వీలో వృషభాల పార్వేట నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: ప్రజలు సంస్కృతి, సాంప్రదాయాలను మరవకూడదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలలో వారు పాల్గొన్నారు. ముందుగా ఎద్దులు, నాగలికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన పూర్వీకులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకునేవారని ప్రస్తుతం అవి కనుమరుగు అవుతున్నా యని బాధ వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించడంతో పాటు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ, మండల కార్యదర్శి వీరేష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని హల్వీ, ఓబుళాపురం, నదిచాగి, దమ్ములదిన్నె, బాపురం గ్రామాలలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ వృషభాలకు స్నానాలు చేయించి కొమ్ములు, శరీరానికి వివిధ రంగులతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం గ్రామ వెలుపల నుంచి ఎద్దుల పార్వేట నిర్వహించారు. గ్రామ చావిడికి ఏ రంగు వృషభం ముందుగా చేరుకుంటుందో ఆ ఏడాది ఆ రంగు పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. అనంతరం వృషభాలను డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తూ పూజిస్తారు. అలాగే ఏరువాక పౌర్ణమి తరువాతే పొలం పనులు ప్రారంభిస్తారు. సాయంత్రం పారువేటను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో యువతకు పరుగుపందెం, ఇసుక బస్తాలు ఎత్తడం, గుండు ఎత్తే పందేలను నిర్వహించారు.

24న వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

ఎమ్మిగనూరుటౌన్: డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ఈ నెల 24వ తేదీన ఉదయం 6 గంటల నుంచి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం తెలిపారు. కుక్కల నుంచి పట్టణవాసులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఈ ప్రక్రియ చేపట్టనున్నామన్నారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

ఎమ్మిగనూరుటౌన్: నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు చోటు చేసుకోవడంతో కష్టపడి చదివి పరీక్ష రాసిన విద్యార్థులు నష్టపోయారని, వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రాన్ని ఒక్కొక్కరికి రూ.32 లక్షలకు అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేసేలా కేంద్ర ప్రభుత్వం మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు అన్సర్, రఫీ, లోకేష్, విష్ణు, హర్ష, రఫీక్, హజరత్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

ఆదోని అర్బన్: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సిసిరాదీప్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు గౌస్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆదోని డివిజన్‌వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని స్కూలు బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి స్కూల్ బస్సుకు డ్రైవర్‌తో పాటు క్లీనర్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, యశ్వంత్, సూరి, నాగరాజు, నరసింహా, రాజు పాల్గొన్నారు.



ఎంవీఐ సిసిరాదీప్తికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థి బస్సులు నడపాలి

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ విద్యార్థి బస్సులు నడపాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా నాయకులు ఖాజ, కృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ అమర్నాథ్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ నందవరం మండలంలోని మాచాపురం, ఇబ్రహీంకోట్టాల, నదికైరవాడి, గంగవరం, పూలచింత తదితర గ్రామాల నుంచి విద్యార్థులు ఎమ్మిగనూరుకు చదువుకునేందుకు వస్తుంటారని, ఆయా గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. విద్యార్థులకు తగ్గట్టుగా బస్సులు నడపాలని కోరారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు